క్లుప్తంగా

బీఆర్ఎస్‌కు మాదిగల మద్దతు



ఆర్మూర్‌టౌన్: త్వరలో జరగనున్న ఎన్నికల్లో మాదిగలంతా బీఆర్ఎస్ పార్టీ వైపు ఉంటారని, మాదిగ సంఘాల యునైటెడ్ ఫ్రంట్ చైర్మన్ కొక్కెర భూమన్న, టీఎంఆర్‌పీఎస్ నాయకుడు ఇటుక రాజు అన్నారు. ఆర్మూర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌తో పాటు నియోజకవర్గ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు బీజేపీతో పొత్తు పెట్టుకుని మాదిగ ఓట్లను బీజేపీకి అమ్ముకుంటున్నారని అన్నారు. జన్ను కనకరాజు, వేముల బలరాం, లింగంపల్లి లక్ష్మణ్, మన్నెపు సత్తెమ్మ తదితరులు ఉన్నారు.

గజ్జలమ్మ దేవి ఉత్సవాలు ప్రారంభం



రుద్రూర్: మండలంలోని అంబం(ఆర్) గ్రామంలో గజ్జలమ్మ దేవి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభయ్యాయి. తెల్లవారుజామున డప్పు చప్పుళ్లతో నల్ల పోచమ్మ, ఎల్లమ్మ, కట్టరాజులు, పోచమ్మ, ఉరడమ్మ, మరిగమ్మ గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలను గ్రామ పెద్దలు ప్రారంభించారు. సాయంత్రం గజ్జలమ్మ ఆలయం వద్ద రథోత్సవం నిర్వహించారు. ఆలయం వద్ద భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. రెండోరోజు జాతర కొనసాగనుంది.



బీజేపీతోనే మాదిగలకు భవిష్యత్



బోధన్‌టౌన్(బోధన్): బీజేపీకి ఓటు వేస్తే మాదిగ జాతి బిడ్డల భవిష్యత్ బాగుంటుందని ఎమ్మెస్పీ జిల్లా కో– ఆర్డినేటర్ డల్లా సురేష్ స్పష్టం చేశారు. పట్టణంలోని రైస్‌మిల్ అసోసియేషన్ భవనంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని ప్రధాని నరేంద్రమోదీ హామీ ఇచ్చారని, మందకృష్ణ చేస్తున్న ఉద్యమాన్ని ప్రధాని గుర్తించారన్నారు. ఎమ్మార్పీఎస్‌తో పాటు అనుబంధ సంఘాలు బీజేపీకి అండగా నిలిచి ఓటు వేయాలని పిలుపు నిచ్చారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు మాదిగ ఉద్యమాన్ని గుర్తించలేదని, అనిచి వేసేందుకు కుట్రలు చేశారని ఆరోపించారు. నాయకులు మానికొల్ల గంగాధర్, ఆకారం రమేష్, లక్ష్మిగారి భూమయ్య, బండారి పోషెట్టి, అబ్బయ్య, గందమాల చంద్రయ్య, పానుగంటి భరత్, రవికుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



పెర్కిట్(ఆర్మూర్): ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన ఐఐటీ ఆర్ఎస్ఎం రాష్ట్ర స్థాయి పరీక్షల్లో మామిడిపల్లిలోని నలంద హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. దీంతో మంగళవారం ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం లక్కారం ప్రసాద్, లక్కారం సాగర్ అభినందించారు. విద్యార్థులను తల్లితండ్రుల సమక్షంలో సర్టిఫికేట్లు అందజేశారు. ఐఐటీ ఫ్యాక్ట్ ఒలింపియాడ్ సైన్స్ ఇన్‌చార్జీలు సందీప్, వాసవి పాల్గొన్నారు. హాజరు కావాల్సిందిగా వారు కోరారు.

ఘనంగా గంగపుత్ర దినోత్సవం



డిచ్‌పల్లి: మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో మంగళవారం మత్స్య గంగపుత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గంగపుత్ర సంఘ ప్రతినిధులు జెండాను ఆవిష్కరించి నినాదాలు చేశారు. చెరువులు, చేపలపై పూర్తి హక్కు గంగపుత్రులకే ఉంటుందని పేర్కొన్నారు. మండల మత్స్యకార సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మీసాల గంగాధర్, రమేష్ కుమార్, సుమన్, రవికుమార్, సభ్యులు సుదర్శన్, గంగాధర్, గోపి, గంగసాగర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్రజల సమస్యలన్నీ పరిష్కరిస్తాం

- బాల్కొండ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి ప్రశాంత్‌రెడ్డి
- గ్రామాల్లో జోరుగా ఎన్నికల ప్రచారం





కోనాసముందర్‌లో మాట్లాడుతున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి.. మంత్రికి బోనాలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

కమ్మర్‌పల్లి: బీఆర్ఎస్ మరోసారి అధికారంలోకి రాగానే ప్రజల సమస్యలన్నీ పరిష్కరిస్తామని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి, బాల్కొండ బీఆర్ఎస్ అభ్యర్థి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని కోనాపూర్, కేసీతండా, కోనా సముందర్‌లలో మంగళవారం ఆయన ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మాట మీద నిలబడే రకం కాదని, తెలంగాణను ఇచ్చి వెనక్కి తీసుకున్న ఆ పార్టీ గత చరిత్రే దీనికి నిదర్శనమని గుర్తు చేశారు. తాను సీఎం కేసీఆర్‌తో ప్రత్యేకంగా విన్నవించి సంఘ భవనాలకు మంజూరు చేయించిన ప్రొసీడింగులను పనికి రానివని మాట్లాడుతున్న వ్యక్తి సన్యాసి అని విమర్శించారు. విపక్షాల నాయకులు తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. తన దగ్గరికి వచ్చిన వారికి కడుపు నిండా అన్నం పెట్టి పంపిస్తానే కానీ.. రూపాయి లంచం అడిగిన చరిత్ర తనది కాదన్నారు. ప్రజలకు సైతం తనపై పూర్తి విశ్వాసం ఉందన్నారు. గట్టుపొడిచిన వాగు కాలువ నీటిని ఎటువంటి ఇబ్బంది లేకుండా అందించే కృషి చేస్తానన్నారు. ప్రజల సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎంపీ కేఆర్ సురేశ్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు కావాల్సిన ఎంత పెద్ద పని అయినా సరే చేసి పెట్టే సత్తా ప్రశాంత్‌రెడ్డికి ఉందన్నారు. అంతకుముందు మంత్రికి మహిళలు బోనాలతో ఘన స్వాగతం పలికారు. నాయకులు భాస్కర్, ఇంద్రాల రూప, అంజమ్మ పాల్గొన్నారు.

అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు



ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న వివిధ కుల సంఘాల ప్రతినిధులు

- ఆర్మూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

ఆర్మూర్: సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించి, రైతుల భూమి సంబంధిత సమస్యలను పరిష్కరిస్తామని ఆర్మూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ నియోజకవర్గంలోని పలు కుల, ప్రజా సంఘాలు, గ్రామాభివృద్ధి కమిటీలు, బీజేపీ, కాంగ్రెస్ నుంచి పలువురు మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. మండలం మచ్చర్లతో పాటు ఆయా గ్రామాల్లో వారికి ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి గులాబి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా ఏకగ్రీవ తీర్మానాలు చేస్తుండడం కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు మరింత ఇబ్బందికరంగా మారిందన్నారు. పదేళ్లుగా అభివృద్ధిలో దూసుకుపోతున్న తెలంగాణ పచ్చదనాన్ని నాశనం చేసేందుకు దాడికి వస్తున్న కాంగ్రెస్, బీజేపీ మిడతల దండుతో మన పోరాటం చేస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ నాశనాన్ని కోరుకుంటున్న ఢిల్లీ గద్దలతో మనం ధర్మయుద్ధం చేస్తున్నామన్నారు. కాంగ్రెస్, బీజేపీలలో ఏదొచ్చినా మన అభివృద్ధి, సంక్షేమ పథకాలు కానరాకుండా పోతాయని హెచ్చరించారు. అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రజలు రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో తనను గెలిపించాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ టౌన్: పట్టణంలోని 32,33, 35, 36వ వార్డులలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ప్రజా ఆశీర్వాద యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆర్మూర్ నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి చేశానని, మళ్లీ గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత, నాయకులు సంజయ్ సింగ్ బబ్లు, పండిత్ పవన్ పాల్గొన్నారు

నిరుపేదలకు ఇంటిస్థలాలు అందిస్తాం



ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

- బోధన్ కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి



పాల్గొన్న గ్రామస్తులు

ఎడపల్లి(బోధన్): నిరుపేదలకు ఇంటి స్థలాలను అందిస్తామని, ఇంటి నిర్మాణానికి రూ. 5లక్షలు అందిస్తామని కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని జాన్కంపేట్, ఎంఎస్సీ ఫారం, జైతాపూర్, బ్రాహ్మణ్‌పల్లి, ఏఆర్‌పీ క్యాంప్, అంబం గ్రామాలలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తొమ్మిదేళ్లుగా ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు రూ.500లకే సిలెండర్‌ను అందిస్తామన్నారు. మహాలక్ష్మీ పథకం ద్వారా ప్రతి మహిళకు రూ. 2500, రైతు భరోసా పథకం ద్వారా ఎకరానికి రూ.15 వేలు, వరికి అదనంగా బోనస్ రూ. 500 చెల్లిస్తామని, మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం, ప్రతి ఇంటికి 200 యూనిట్ల విద్యుత్ సౌకర్యం కల్పిస్తామన్నారు. జైతాపూర్ సర్పంచ్ శ్రీలక్ష్మి రామ్ గోపాల్, ఎమ్మెస్సీ ఫారం సర్పంచ్ విజయ్ కుమార్, నాయకులు పులి శ్రీనివాస్, రాధా కిషన్ గౌడ్, విజయ్ గౌడ్ పాల్గొన్నారు.

పోచారం గెలుపు కోసం కృషి చేయాలి



రుద్రూర్‌లో మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి

రుద్రూర్: బాన్సువాడ బీఆర్ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి గెలుపు కోసం పార్టీ కార్యకర్తలు పనిచేయాలని, నెల రోజులు కష్టపడితే నాలుగేళ్ల 11 నెలలు ప్రజాసేవలోనే ఉంటారని డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి అన్నారు. రుద్రూర్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన పార్టీ కార్యకర్తలకు ఎన్నికల ప్రచారంపై దిశానిర్దేశం చేశారు. ఎన్నికల సమయంలో అండగా ఉండే వ్యక్తే అసలైన కార్యకర్త అని అన్నారు. బాన్సువాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పోచారం సురేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ నరోజి గంగారాం, పత్తి లక్ష్మణ్, వైస్ఎంపీపీ నట్కరి సాయిలు, తోట్ల గంగారాం, పత్తి రాము, తోట సంగయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు రుద్రూర్‌లో పోచారం ప్రచారం

రుద్రూర్: మండలంలోని బొప్పాపూర్ గ్రామంలో, రుద్రూర్‌లో బాన్సువాడ బీఆర్ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు పార్టీ మండల, గ్రామ కమిటీ అధ్యక్షుడు పత్తి లక్ష్మణ్, తోట్ల గంగారాం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో కార్యక్రమానికి తరలిరావాలని కోరారు.

బీజేపీతోనే మహిళా సాధికారత సాధ్యం



మాట్లాడుతున్న మధ్యప్రదేశ్ మంత్రి రాజేందర్‌శుక్లా

ఆర్మూర్‌టౌన్: మహిళ సాధికారత బీజేపీతోనే సాధ్యమని మధ్యప్రదేశ్ మంత్రి రాజేందర్‌శుక్లా అన్నారు. ఆర్మూర్‌లో మంగళవారం పలువురు మహిళలు బీజేపీకి మద్దతు తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి రాజేందర్‌శుక్లా ముఖ్యతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. బీజేపీ లోక్‌సభ, కేంద్ర పాలిత ప్రాంతాలలో మహిళలకు 33% రిజర్వేషన్ కల్పిస్తూ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టడం హర్షించదగ్గ విషయమన్నారు. అనంతరం అంబేడ్కర్ చౌరస్తాలో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి పైడి రాకేష్ రెడ్డి సతీమణి రేవతిరెడ్డి, కూతురు పైడి సుచరిత రెడ్డి పూలమాల వేశారు. విజయ భారతి, బీజేపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ఒక్కసారి అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తా

- బాల్కొండ కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్ రెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు



కమ్మర్‌పల్లిలో మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి

కమ్మర్‌పల్లి: తనకు ఒక్కసారి అవకాశం ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంతో పాటు, ఉప్లూర్, నాగాపూర్, శ్రీరాజరాజేశ్వరీ నగర్ గ్రామాల్లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొమ్మిదిన్నర ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని, అదేవిధంగా పంట పెట్టుబడి సహాయం కింద ఎకరానికి ప్రతి సంవత్సరానికి రూ 15వేలు పెట్టుబడి సాయం కింద అందిస్తామని తెలియజేశారు. భూమిలేని రైతు కూలీలకు సంవత్సరానికి రూ. 12 వేలు సాయం అందిస్తామని హామీనిచ్చారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం సదుపాయం కల్పిస్తామని తెలిపారు. నాయకులు వేణుగోపాల్‌యాదవ్, సుంకెట రవి, బుచ్చారెడ్డి, నిమ్మ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ధర్పల్లికి రేవంత్‌రెడ్డి రాక

ధర్పల్లి: ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ధర్పల్లి రానున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజు తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని మైదానంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి పాల్గొ ని మాట్లాడతారన్నారు. కాంగ్రెస్ నాయకులు మంగళవారం సభ ఏర్పాట్లను పరిశీలించారు.

రేవంత్‌రెడ్డి సభను విజయవంతం చేయండి

ఇందల్వాయి: ధర్పల్లిలో నేడు జరిగే రేవంత్‌రెడ్డి భారీ బహిరంగ సభకు ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు తరలిరావాలని మండల కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నవీన్ గౌడ్, కర్నం మోహన్, గంగాధర్, సుధాకర్, సంతోష్‌రెడ్డి, ఒడ్డె రాజు, లక్ష్మి పాల్గొన్నారు.

పెన్షన్‌లు కట్ చేస్తామంటే తరిమికొట్టండి



ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతున్న బీజేపీ బాల్కొండ అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మ

భీమ్‌గల్: కారు గుర్తుకు ఓటు వేయకపోతే పెన్షన్‌లు కట్ చేస్తామంటు బీఆర్ఎస్ నాయకులు బెదిరిస్తున్నారని, అలాంటి వారిని తరిమికొట్టండని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మ అన్నారు. మండలంలోని సికింద్రపూర్ గ్రామంలో మంగళవారం ఆమె ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ.. ఆరు గ్యారంటి పథకాల పేరుతో కాంగ్రెస్ నాయకులు ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూంలు అర్హులకు ఇవ్వకుండా పార్టీ కార్యకర్తలకే ఇచ్చుకొని సామాన్యులకు అన్యాయం చేశారని మండి పడ్డారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండు ఒకటేనని, ఆ రెండు పార్టీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. బాల్కొండలో బీజేపీని గెలిపిస్తే మరెన్నో అభివృద్ధి పనులు చేసుకోవచ్చని తెలిపారు. నాయకులు మల్కన్నగారి మోహన్, ములిగే మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి ఒక్కసారి అవకాశం ఇవ్వండి

- ఆర్మూర్ అభ్యర్థి పైడి రాకేశ్ రెడ్డి



డొంకేశ్వర్‌లో రాకేశ్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

డొంకేశ్వర్(ఆర్మూర్): రాష్ట్రంలో అరాచక పాలన, అవినీతి ఉండకూడదంటే బీజేపీకి ఓటు వేసి అధికారంలోకి తేవాలని బీజేపీ ఆర్మూర్ ఎమ్మెల్యే అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డి ప్రజలను కోరారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో, బీజేపీ నాయకులు గజమాలతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం రాకేశ్ రెడ్డి మాట్లాడుతూ.. ఒక్క ఇంట్లో రెండు పింఛన్లు రావాలన్నా, నిరుద్యోగులకు ఉద్యోగాలు కావాలన్నా బీజేపీకి ఒక్కసారి అవకాశం ఇచ్చి చూడాలని కోరారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే గ్రామాల్లో ఏడాదిలోగా ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నానని, ఒకవేళ మాటను తప్పితే తన పదవికి రాజీనామా చేస్తాని స్పష్టం చేశారు. నాయకులు సురేందర్, ఎంపీటీసీ సంజీవ్, నాయకులు క్లెం సంతోష్ రెడ్డి, చిన్న తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు బ్రాహ్మణ సంఘం మద్దతు

నిజామాబాద్ సిటీ: బీఆర్ఎస్‌కు మద్దతు తెలుపుతున్నట్లు నిజామాబాద్ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు కిరణ్ దేశ్‌ముఖ్ తెలిపారు. నగరలోని సంఘ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్‌తో బ్రాహ్మణులకు రాష్ట్రంలో గొప్ప గౌరవం దక్కిందని, ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని అన్నారు. బ్రాహ్మణుల కోసం కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌కే ఓట్లు వేయాలని బీజేపీని తిరస్కరించాలని బ్రాహ్మణులకు పిలుపునిచ్చారు. సంఘ సభ్యులు సురేష్, ఘనాపాటి జ్యోషి మధుసూదన్ శర్మ, సంజీవ్‌శర్మ, అరవింద్ శర్మ, రమేష్ కులకర్ణి, వేణు, మునిపల్లి శేఖర్, లక్ష్మీనారాయణ భరద్వాజ్, వాసంతి పాల్గొన్నారు.

అవినీతి పార్టీలను ఓడించాలి

ఖలీల్‌వాడి: రాబోయే ఎన్నికల్లో అవినీతి, మతోన్మాద పార్టీలను ఓడించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ పేర్కొన్నారు. కోటగల్లిలోని ఎన్ఆర్ భవన్‌లో మంగళవారం ఎన్నికల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. కృష్ణ మాట్లాడుతూ.. నిరంకుశ, ఫాసిస్టు, మతోన్మాద విధానాలను అవలంబిస్తున్న బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం పార్టీల అభ్యర్థులను ఓడించాలని, వారిని ఓడించగలిగే సమీప ప్రత్యర్థిని గెలిపించాలని కోరారు.

కార్యక్రమంలో నాయకులు ఆల్గోట్ రవీందర్, సుధాకర్, సాయగౌడ్, మురళి, గంగమల్లు, గోదావరి, సంధ్యారాణి, గణేష్, కిషన్, విటల్, కిరణ్, సాయిబాబా, మహేష్, రమేష్, లక్ష్మీకాంత్, అరుణోదయ, గంగారం, గౌరీ, నర్సక్క, గంగాధర్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గోపాష్టమి వేడుకలు



సుభాష్‌నగర్: నగరంలోని గోశాలలో మంగళవారం విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు దినేష్ ఠాకూర్ ఆధ్వర్యంలో గోపాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. 400 గోమాతలకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమానికి బీజేపీ అర్బన్ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా కుటుంబ సభ్యులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేనేజర్ కృష్ణారావు, గోశాల కార్యదర్శి మాస్టర్ శంకర్, జిల్లా కార్యదర్శి గాజుల దయానంద్, ఆనంద్, ధాత్రిక రమేష్, అరుణ్‌రెడ్డి, కోశాధికారి నాంపల్లి శేఖర్, ప్రణయ్, రామన్న, బంజా రమేష్, గంగాధర్, నరేష్ గౌడ్, దేశాయి గంగాధర్ పాల్గొన్నారు.

వివిధ పార్టీల్లో పలువురి చేరిక



మాక్లూర్: మండలంలోని వల్లభాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు 50 మంది మంగళవారం సచిన్, కుర్నే మహేష్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఆర్మూర్ బీజేపీ అభ్యర్థి పైడి రాకేష్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. నాయకులు మహిపాల్, అశోక్, సంజీవ్, సుధాకర్ పాల్గొన్నారు.

ఆర్మూర్ పట్టణంలో..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని అశోక్ నగర్ కుమ్మరి సంఘ సభ్యులు, 13వ వార్డులో ముదిరాజ్ సంఘం సభ్యులు,



హస్నాబాద్ కాలనీలో కొత్తమున్నూర్‌కాపు సంఘ సభ్యులు, చైతన్య సంఘం, మేస్త్రీల సంఘం సభ్యులు బీజేపీలో చేరారు. వారికి పైడిరాకేష్‌రెడ్డి కాషాయ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

బీఆర్ఎస్‌లోకి..



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం మచ్చర్ల గ్రామంలోని అంబేడ్కర్ మాల సంఘాల సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే జీవన్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అలాగే రాంపూర్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. ఎంపీపీ పస్క నర్సయ్య, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి..



బోధన్: పట్టణ బీఆర్ఎస్ యువజన విభాగం నియోజక వర్గ ప్రధాన కార్యదర్శి మఠం శివ కుమార్, ఉపాధ్యక్షుడు జక్కా సంజుపటేల్, వారి అనుచరులు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. నాయకులు తూము శరత్‌రెడ్డి, అల్లె రమేష్ పాల్గొన్నారు.